క్లుప్తంగా

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకారంలో పోలేరమ్మ

మనుబోలు: మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. దేవి ఖడ్గమాల, సామూహిక కుంకుమార్చన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం నూతక్కివారికండ్రిగ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎస్సై తిరుమలరావు సోమవారం కేసు నమోదు చేశారు. తూర్పుపల్లికి చెందిన రత్నమ్మ శుక్రవారం ఉదయం నూతక్కివారికండ్రిగ సమీపంలోని నిమ్మతోటలోకి పనికి వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వస్తున్న క్రమంలో టాటా మ్యాజిక్ డ్రైవర్ బాబు మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ రత్నమ్మను ఢీకొన్నాడు. దీంతో రత్నమ్మ తీవ్రంగా గాయపడగా నెల్లూరుకు తరలించారు. సోమవారం ఆమె స్పృహలోకి రావడంతో వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేజ్ వీల్స్‌తో ధ్వంసం

- కొందరు యథేచ్ఛగా తిప్పేస్తున్న వైనం
- అవగాహన పెంపునకు అధికారులు కృషి చేయాలి

గతంలో పొలాన్ని దున్నేందుకు రైతులు ఎద్దులను వినియోగించేవారు. కాలక్రమేణ వ్యవసాయ యాంత్రీకరణలో గణనీయమైన మార్పులు వచ్చాయి. అనేక మంది ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. అయితే కొందరు కేజ్ వీల్స్‌ను రోడ్లపై యథేచ్ఛగా నడిపేస్తున్నారు. దీంతో రహదారులు దెబ్బతింటున్నాయి. వాటిపై ప్రయాణం నరకయాతనగా ఉంటోంది. అన్నదాతల్లో చైతన్యం కల్పించడం ద్వారానే ఈ సమస్యకు క్లైం పడుతుంది. ఆ దిశగా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయత్నించాల్సి ఉంది.

మండల పరిధిలో..

కేజ్ వీల్స్ ఉన్న రైతులు : 200లకు పైగా..

తారురోడ్ల విస్తీర్ణం : 100 కి.మీ


కేజ్ వీల్స్ వల్ల పెద్ద ఎత్తున గీతలు పడి గుంతలుగా మారిన రోడ్డు

కొడవలూరు : మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ట్రాక్టర్‌లున్నాయి. ఇలా దాదాపు 200లకు పైగా కేజ్ వీల్స్ ఉన్న రైతులు మండలంలో ఉన్నారు. వ్యవసాయ పనులు జరిగే సమయంలో రైతులు వాటిని అధికంగా వినియోగిస్తుంటారు. అయితే కొందరు రైతులు ట్రాక్టర్ చక్రాల స్థానంలో ఇనుప కేజ్ వీల్స్‌ను అమర్చుకొని రోడ్లపై వెళ్తుండడం మనం చూస్తూనే ఉంటాం. వీటి కారణంగా తారురోడ్లు అనతి కాలంలోనే దెబ్బతింటున్నాయని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇవి ఇనుప చక్రాలు కావడం, బాగా పదునుగా ఉండడం వల్ల రోడ్డులో దిగబడుతున్నాయి. తొలుత గీతలు వలె లోతుగా పడి ఆ తరువాత వాహనాలు తరచూ తిరగడం వల్ల గుంతలుగా మారుతున్నాయని స్పష్టం చేస్తున్నారు.

ఏం చేయాలంటే

కేజ్ వీల్స్ అవసరమైనప్పుడు వాటిని పొలంలోకి ట్రాక్టర్ ట్రక్కులో తీసుకెళ్లి అక్కడ పని పూర్తయ్యాక తిరిగి ట్రక్కులోనే వేసుకొని ఇంటికి చేర్చాలి. కానీ అలా చేయకుండా ఇంటి వద్ద నుంచే ట్రాక్టర్ చక్రాల స్థానంలో కేజ్‌వీల్స్‌ను అమర్చి రోడ్లపై నుంచి తీసుకొని పొలాలకు వెళ్తున్నారు. ఇలా చేయడం వల్ల రోడ్ల ఆయుష్షు సగానికి పడిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చైతన్యం పెంచాలి

మండలంలో తారురోడ్ల విస్తీర్ణం 100 కిలోమీటర్లకు పైగా ఉంది. కేజ్‌వీల్స్ కారణంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు చెందిన తారురోడ్లే సింహభాగం దెబ్బతింటున్నాయి. వీరు రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలి. రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కేజ్‌వీల్స్‌ను రోడ్లపై నడపడం వల్ల వచ్చే నష్టాలను వివరించాలి. రోడ్లు అనతికాలంలోనే దెబ్బతినడం వల్ల వెంటనే మరలా పునరుద్ధరించే వీలు లేక గుంతలమయంగా ఉన్న రోడ్లపైనే ప్రయాణించాల్సి వస్తోందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలి. కొందరు రైతులు చేసే ఈ పొరపాటు కారణంగా ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని వివరించాలి. కానీ ఆ రెండు శాఖల అధికారులు ఆ దిశగా యత్నిస్తున్న దాఖలాలుండడం లేదు.


కేజ్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

రైతుల్లోనూ బాధ్యత అవసరం

కేజ్ వీల్స్‌ను రోడ్లపై నడిపే విషయంలో రైతులు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. రూ.లక్షలు వెచ్చించి వేసిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నందున అలా నడపడానికి స్వతహాగా స్వస్తి చెప్పాలి. రోడ్లు గుంతలమయంగా మారడం వల్ల ఎంతో మంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్న విషయాన్ని గ్రహించాలి. కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ ట్రక్కులలో తీసుకుపోయేలా బాధ్యత తీసుకోవాలి.

వైభవంగా గంగమ్మ ఊరేగింపు


గంగమ్మ గ్రామోత్సవం

మనుబోలు: ఉగాది పండగను పురస్కరించుకుని మనుబోలు మండల కేంద్రంలో గంగమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. గంగమ్మకు అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గంగమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం జరిపారు. మహిళా భక్తులు గంగమ్మకు మంగళ హారతులిచ్చారు. ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన మంగళ వాయిద్యాలు, తప్పెట్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలకు యాదవ సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం


ముగ్గురమ్మల గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం : ఉగాది సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మతో పాటు పోలేరమ్మ, గంగమ్మలను కనిగిరి రిజర్వాయర్ వద్ద నుంచి అశేష భక్తజనం మధ్య తప్పెట్లు మేళతాళాలతో బాణసంచా పేలుస్తూ ఊరేగింపు చేశారు. విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారి ఇళ్ల వద్ద ముగ్గురమ్మలను నిలిపి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ముంబై రోడ్డు నుంచి చెన్నూరు రోడ్డు మీదుగా ముగ్గురమ్మల ఊరేగింపు కొనసాగింది. భక్తులు అమ్మవార్లకు అడుగడుగునా కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అమ్మవార్లు తిరిగి కనిగిరి రిజర్వార్ వద్దనున్న ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవార్లకు హారతులిచ్చి ఆలయంలోకి తీసుకెళ్లారు.

కార్పొరేషన్‌కు పంగనామం

- ఎన్‌ఎంసీకి ఆస్తి పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- రూ.36.67 కోట్ల మేర బకాయిలు
- ఏళ్లుగా పట్టించుకోని అధికారులు
- ఆదాయాన్ని కోల్పోతున్న నగరపాలక సంస్థ
- వసూళ్లలో మొహమాటానికి పోతున్న అధికారులు

నెల్లూరు(బారకాసు) : ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన చర, స్థిరాస్తులకు సంబంధించి నగరపాలక సంస్థకు ఆస్తి విలువను బట్టి పన్ను చెల్లించాలనే నిబంధనలు ఉన్నాయి. ఎన్‌ఎంసీ పరిధిలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్, పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్, పోలీస్, విద్యుత్‌శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రభుత్వ ఆస్పత్రులు, అగ్నిమాపక కేంద్రం ఇలా పలు ప్రభుత్వ భవనాలకు ఆస్తి పన్నును సంబంధిత అధికారులు చెల్లించాల్సి ఉంది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వంద వరకు ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. ఆయా కార్యాలయాలకు ఆస్తి పన్ను చెల్లించాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన ఉండటం లేదు. పన్నుల వసూళ్లలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఉన్న మొహమాటంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో నగరపాలక సంస్థ అభివృద్ధి అంతంతమాత్రంగానే సాగుతోంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ శాఖల కార్యాలయాల నుంచి పన్ను బకాయి రూ.36,67,35,000కు పేరుకుపోయింది.

పలు ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వివరాలు

రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి మొత్తం 400 అసెస్‌మెంట్స్ ఉన్నాయి. వీటి నుంచి రూ.32,92,00,000 రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.2,29,00,000 వసూలైంది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన మొత్తం అసెస్‌మెంట్స్ 41 ఉండగా వీటి నుంచి రూ.6,07,00,000 రావాల్సి ఉంటే ఇప్పటి వరకు చెల్లించిన మొత్తం రూ.2,65,000. ఇంకా ఎన్‌ఎంసీకి రూ.6,04,35,000 చెల్లించాల్సి ఉంది. ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను దాదాపు 20 సంవత్సరాల నుంచి బకాయిలు ఉన్నాయి. వీటిని వసూలు చేసేందుకు ఎన్‌ఎంసీ అధికారులు ఎందుకు మొహమాటం పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇకనైనా సంబంధిత ఎన్‌ఎంసీ ఉన్నతాధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తిపన్ను బకాయిలను కచ్చితంగా వసూలు చేసేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఇలా రూ.కోట్లు మేర బకాయిలు పేరుకుపోయే పరిస్థితి ఏర్పడనుంది.

నోటీసులు జారీ చేస్తున్నాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని తమ వంతుగా నోటీసులు జారీ చేస్తునే ఉన్నాం. ఆయా ప్రభుత్వ కార్యాలయ అధికారులు కూడా స్పందించి ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నారు. ప్రభుత్వం నుంచి పన్ను చెల్లించేందుకు నిధులు పంపించిన వెంటనే చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.2 కోట్లకు పైగా వసూలు చేశాం. మిగిలిన బకాయిలను కూడా వసూలు చేస్తాం.

– చెన్నుడు, డిప్యూటీ కమిషనర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్

భక్తిశ్రద్ధలతో..


మనుబోలు: శుభాకాంక్షలు చెప్పుకొంటున్న చిన్నారులు


బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో..


పొదలకూరు: సందేశమిస్తున్న ముస్తాక్ మదానీ

- మండలాల్లో ఈద్ – ఉల్ – ఫితర్ వేడుకలు

ముత్తుకూరు: మండలంలో ముస్లింలు ఈద్ – ఉల్– ఫితర్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. స్థానిక మసీదు నుంచి వందల సంఖ్యలో ముస్లింలు ఊరేగింపుగా బయలుదేరి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఈద్గా వద్ద ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మతపెద్దలు రంజాన్ సందేశాన్ని అందించారు. ఇంకా బ్రహ్మదేవి, మామిడిపూడి, పొట్టెంపాడు, పల్లెపాడుదిబ్బ, ఈపూరు గ్రామాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వేల సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

➡ **వెంకటాచలం:** మండల కేంద్రమైన వెంకటాచలం, సర్వేపల్లి, కసుమూరు, గొలగమూడి, కాకుటూరు, కనుపూరు తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కసుమూరు గ్రామంలోని మస్తాన్‌వలీ దర్గాలో పడమటి వాకిలి తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రతి రంజాన్ రోజు మాత్రమే ఈ వాకిలి ద్వారా దర్గాలోకి అనుమతిస్తారు.

➡ **మనుబోలు:** మండలంలో రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో మత పెద్ద ఇమామ్ హమానుల్లా ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సామూహిక ప్రార్థనలు చేశారు. దానాలు చేస్తూ ఇతరుల పట్ల దయతో వ్యవహరించాలని మత పెద్ద సందేశాన్ని అందించారు. కార్యక్రమాల్లో కరిముల్లా, షేక్ అన్సర్, జలీల్, అహ్మద్, జకీర్, అన్వర్, షఫీ, హాజీబ్ తదితరులు పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** రంజాన్ సందర్భంగా పట్టణానికి సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత పెద్ద ముస్తాక్ మదానీ సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలని, పేదల పట్ల కరుణతో ఉండాలన్నారు. నెలరోజులపాటు కఠిన ఉపవాస దీక్ష పాటించిన ముస్లింలు పండగను ఆనందంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. పేదలకు ఎల్లవేళలా సహాయం చేయాలని, సన్మార్గంలో నడవాలన్నారు. పరమత సహనం పాటించాలని సూచించారు. దాన, ధర్మాలు చేస్తూ న్యాయబద్ధంగా జీవించాలన్నారు. మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కరిముల్లా, మహబూబ్‌బాషా, మసుం సాహెబ్, ఖాదర్ మస్తాన్, మహమ్మద్ రఫీ, అబ్బాస్, ముజాహిద్, చాంద్‌బాషా, బాబు సాహెబ్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** రంజాన్ ఈద్‌ను మండలంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నార్తురాజుపాళెం, యల్లాయపాళెం, గండవరం మసీదులు, కొడవలూరు ఈద్గాలలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. నెల రోజులపాటు సాగించిన ఉపవాస దీక్షలను ఈద్ రోజున విరమించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. దీంతో మండలంలోని అన్ని మసీదుల వద్ద సోమవారం సందడి నెలకొంది.

➡ **ఇందుకూరుపేట :** రంజాన్ ఈద్‌ను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు, కొరుటూరు, మైపాడు, గంగపట్నం, రాముడుపాళెం, కుడితిపాళెం, రావూరు, కొమరిక తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు రంజాన్ పర్వదినం గొప్పతనాన్ని చాటిచెప్పారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

➡ **బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెంలో రంజాన్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కులమత భేదాలు లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. స్థానిక ఖాజానగర్, పాత కాశీపాళెంలోని మసీదుల ప్రాంగణంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


కొడవలూరు : ఉపవాస దీక్షలను విరమిస్తున్న ముస్లింలు


మనుబోలు: ఈద్గా వద్ద ప్రార్థనలు


కొడవలూరు : నార్తురాజుపాళెం మసీద్‌లో ముస్లింల ప్రార్థనలు


ముత్తుకూరు: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


పొదలకూరు : ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


ఇందుకూరుపేట : కొత్తూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పొదలకూరు : మొగళ్లూరులో..


వెంకటాచలం: కసుమూరు దర్గా వద్ద భక్తులు

అలరించిన సంగీత రవళి


సంగీత విద్వాంసురాలికి సన్మానం

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన భక్తి సంగీత రవళి కార్యక్రమం అలరించింది. ప్రేమసాధ ఫౌండేషన్ చైర్మన్ నల్లమల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గాయకులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు, దేశభక్తి గీతాలు, యుగళ గీతాలతో మందిరం పులకించింది. ఈ సందర్భంగా సంగీత విద్వాంసురాలు వేదాంతం హర్షవర్ధినితో పాటు జ్యోతిష్య నిపుణుడు గోవర్ధన్‌లను సన్మానించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఎ.జయప్రకాష్, ప్రకాశ్‌రావు, బంగారయ్య, సేల్స్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రపాల్‌సింగ్, పేరూరి ప్రదీప్, నలుబోలు బలరామయ్యనాయుడు, గాయకులు సుదర్శన్, సుధారాణి, విజయలక్ష్మి, ఉమామహేశ్వర్, సురేష్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో జీవన యోగశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన వారికి ఉగాది ప్రతిభా పురస్కారాలను సోమవారం రాత్రి ప్రదానం చేశారు. రామాయణం మహేష్‌నంద స్వామి, ఎ.జయప్రకాష్, యోగా గురువు స్వప్న, శారదామణి, ముత్యాల రవీంద్ర, బలరామయ్యనాయుడు, పాబోలు సత్యనారాయణ, కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్, యోగా గురువు ప్రసన్నకుమార్ పర్యవేక్షించారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై పరిశీలన

సంగం: స్థానిక పాత చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్సీ కాలనీలో మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై ఐసీడీఎస్ పీడీ నిర్మలాదేవి, డిప్యూటీ డీఈఓ జానకీరాం సోమవారం పరిశీలించారు. రెండ్రోజుల క్రితం సంగంలో పర్యటించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎస్సీకాలనీలో మినీఅంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మేర చిన్నారులు ఉన్నారా? లేదా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పీడీ తెలిపారు. 1, 2 తరగతుల విద్యార్థులు హైవే దాటి వెళ్లకుండా ప్రీస్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు.

